# గాలిపడగలు

గాలిపడగలను ఎగరవేస్తూంటే వాళ్ళను చూస్తే నాకు మహాపెద్ద సంబరం-చిన్నవాళ్ళే అన్న మాటలేదు; పెద్దవాళ్లు ఎగరవేస్తున్నా సరే. అసలు పెద్దవాళ్లు—నేలంటువదిలినవాళ్లు—ఎగరవేస్తేనే దాని లోని మజా-

మొన్న గోవిందప్పనాయకవీధిలో చమురు మరకలుపడిన నల్లలాగు తొడుక్కుని, పైమీద బనీనైనా లేకండా, వీరభద్రుడిలాగ జుట్టు విరగబోసుకుని, నోటితో పంచదార ఖడ్డీద్రవాన్ని జుర్రుతూ, ఓ నలభై యేళ్ళబుల్లి వైశ్యకుంజరం గాలిపడగ ఎగరవేస్తూంటే చూస్తూ అట్టే నిలబడిపోయాను.

ప్రకృతి బిడ్డడు! పేరుకిమట్టుకు అమ్మా, అయ్యావున్నా। వాళ్ళదుగ్గ రా లేమీ, ఆ చీకటిగదుల స్వభావమేమీ ఇతడ్ని అంటు. చెయ్యలేదు. పుట్టింది మానవకాంత గర్భంలోంచే అయినా పెరిగింది ప్రకృతికాంత తొడమీద.

ప్రకృతిలో ఆట, ప్రకృతితో శృతికలిపి పాట—ఆ అర్భకుడి కార్య క్రమం. అరుగుమీద వున్న పెద్దబాలశిక్ష (ఆ ఇంటిలోని వారందరికీ విద్యాగంధం పూసి వారిని పాడుచేసిన ప్రకృతి వ్యతిరేకశక్తి అదే!) గాలికెగిరి అరుగు క్రిందనున్న పెంట డబ్బాలో పడుతున్నా గమనించు కండా, అతడింకా గుప్పెట్లోని దారాన్ని విడుస్తూ, తన పడగకు ఆయుష్షు పెంచుతూనేవున్నాడు. అది పైకి వెడుతూన్న కొద్దీ, అవతల వీధి పోటీపడగల నన్నిట్నీ ఆకుదూసినట్టు దూసేసి అది శరవేగంతో గగనవీధి కెగబ్రాకుతూన్న కొద్దీ అతడి ముఖంలోని ఆనందభవనం కుమ్మ రాలమవుతూ, శరత్కాంతులను విరజిమ్ముతూంది!

ఆ కోమటి బిడ్డడి ఆనందం మనలో ఎందరి సొత్తు? గాలిపడగలను ఎగరవేయడానికి అతడు చూపే ఉత్సాహాన్ని, సంసిద్ధతనూ మనలో ఎందరు చూపగలరు?

నోళ్లు పెగలవు!

నిజానికి, మనమంతా చిన్నతనంలో గాలిపడగలు ఎగరవేసిన వాళ్ళమే, బొంగరాలూ, గోళీబిళ్ళలూ ఆడినవాళ్ళమే. కాని, ఇప్పుడు, ఈ రోజున, ఈ పెద్దరికంలో గాలిపడగలు ఎగరవేయడమన్నా, బొంగరాలు త్రిప్పడమన్నా భిడియపడతాం; గొట్టికాయ లాడేవాళ్లనూ దూదుంపుల్లాట ఆడేవాళ్లనూ ఏవగించుకొని, మూర్ఖులంటాం.

దీనికి కారణం మనం అంతకన్నా పెద్ద ఆటలూ, గొప్ప ఆటలూ నేర్చుకుని వుండటమే నంటారు కొందరు మహనీయులు. కాని, క్లబ్బులో పేకాట, గుంపులో కుమ్ములాటా, కోర్టులో దొమ్ములాట ఆ కోమటిపిల్లవాడి ఆనందంలాంటి స్వచ్ఛందమైన ఆనందాన్ని మనకు మనకు ఇస్తాయా, ఇవ్వగలవా? అని.

* * *

గాలిపడగలను కాదని మనం తప్పించుకుపోలేం, అవి మన జీవితపు టంచులు. మనం ఎంత తప్పించుకోవాలని చూసినా అవి మన జీవిత కరిహద్దులను అంటిపెట్టుకునే వుంటాయి. గాలి మనకు కావాలి. దాన్ని మనం అఖ్ఖిల్లేదనలేం. అలానే గాలి పడగలుకూడాను. అవి మన ఊహా పథాల్లో విహరింపక మానవు.

---

## కృతజ్ఞతాభావం

కుక్కలు పూర్వకాలంలో తోడేళ్ళకు మల్లేవుండేవట. అందుచేత నే విజ్ఞానవేత్తలు తోడేలు చిక్కిపోయి కుక్కగా మారిందనీ, పంది బలిసిపోయి ఏనుగగా మారిందనీ తమ పరిశోధన గ్రంథాలలో వ్రాసి పెట్టారు.

ఈరోజున మనం చూసే కుక్కలకీ పూర్వకాలపు కుక్కలకీ ఎంతో వ్యత్యాసంవుంది, రూపంలోనే గాకుండా, చేష్టలలోనూ, నైజాల లోనూ, మానసిక ప్రవృత్తులలోనూ కూడా.